మరో 5,973 టీచర్ పోస్టులు

- భర్తీకి ఆర్థికశాఖ గ్రీన్‌సిగ్నల్
- మొత్తం 11,062 పోస్టులకు మెగా డీఎస్సీ
- కొత్త నోటిఫికేషన్ జారీకి అవకాశం

హైదరాబాద్, ఫిబ్రవరి 26 (నమస్తే తెలంగాణ) : టీచర్‌పోస్టుల భర్తీలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకొన్నది. డీఎస్సీ ద్వారా భర్తీచేసే పోస్టుల సంఖ్యను పెంచింది. మరో 5,973 టీచర్ పోస్టులను అదనంగా భర్తీచేసేందుకు అనుమతి ఇచ్చింది. ఈ మేరకు ఆర్థికశాఖ సోమవారం పచ్చజెండా ఊపుతూ రెండు వేర్వేరు జీవోలను జారీచేసింది. జీవో -27 ద్వారా 4,957 పోస్టుల భర్తీ, 1,016 స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్ ఉద్యోగాల నియామకానికి జీవో - 26ను ఆర్థికశాఖ జారీచేసింది. గతంలో 5,089 పోస్టుల భర్తీకి గత కేసీఆర్ సర్కారు నోటిఫికేషన్‌ను జారీచేసిన విషయం తెలిసిందే. ఈ పోస్టులకు పోటీపడేందుకు 1.77లక్షల మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకొన్నారు. రాష్ట్రంలోకొత్త ప్రభుత్వం కొలువుదీరటంతో డీఎస్సీపై దృష్టిపెట్టింది. మెగా డీఎస్సీని ప్రకటిస్తామని కాంగ్రెస్ తన మ్యానిఫెస్టోలో ప్రకటించడంతో టీచర్ పోస్టులను పెంచింది. ఈ నేపథ్యంలోనే 5,973 టీచర్ పోస్టులకు పాఠశాల విద్యాశాఖ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించగా,ఆర్థికశాఖ గ్రీన్‌సిగ్నల్‌నిచ్చింది. దీంతో గతంలో నోటిఫికేషన్‌లో ప్రకటించినవి.. తాజాగా ఆర్థిక శాఖ ఆమోదించినవి కలుపుకొంటే మొత్తం పోస్టుల సంఖ్య 11,062కు చేరింది. గ్రూప్ - 1 తరహాలోనే పాత డీఎస్సీని రద్దుచేయనున్నట్టు విద్యాశాఖ వర్గాలు తెలిపాయి.

త్వరలోనే డీఎస్సీ నోటిఫికేషన్

కొత్తగా డీఎస్సీ నోటిఫికేషన్‌ను రెండు మూడురోజుల్లో పాఠశాల విద్యాశాఖ విడుదల చేయనున్నది. అయితే, ఈసారి టెట్ లేకుండానే డీఎస్సీ నోటిఫికేషన్‌ను విడుదల చేస్తారు. తాజా సమాచారం ప్రకారం ఈ పోస్టుల్లో 6,500కు పైగా సెకండరీ గ్రేడ్ టీచర్ (ఎస్జీటీ) పోస్టులున్నాయి. స్కూల్ అసిస్టెంట్ (ఎస్ఏ) పోస్టులు 2,600, పండిట్ పోస్టులు 700, పీఈటీలు 190 పోస్టులున్నట్టు తెలిసింది.

అటవీశాఖలో బదిలీలు, ప్రమోషన్లు

హైదరాబాద్, ఫిబ్రవరి 26 (నమస్తే తెలంగాణ): రాష్ట్రప్రభుత్వం అటవీశాఖ అధికారులకు బదిలీలు, ప్రమోషన్లు కల్పిస్తూ ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ మోహన్ చంద్ర పర్గేయిన్‌ను వైల్డ్‌లైఫ్ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్‌గా, హరితహారం చీఫ్ ప్రిన్సిపల్ కన్జర్వేటర్ డాక్టర్ సీ సువర్ణను కంపా సీఈవోగా, ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్‌గా, అడిషనల్ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ సునీతా ఎం భాగవత్‌ను అడిషనల్ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ (అడ్మిన్)గా నియమించారు. 2010 బ్యాచ్‌కు చెందిన ఎస్ శాంతారాంకి ప్రమోషన్‌పై మంచిర్యాల కవ్వాల్ టైగర్ రిజర్వ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్, ఫీల్డ్ డైరెక్టర్‌గా నియమించింది. 2011 బ్యాచ్‌కి చెందిన ఎస్ రాంబాబును హైదరాబాద్ సర్కిల్ డీసీఎఫ్‌గా, డాక్టర్ సునీల్ ఎస్ హెరిమత్‌ను నెహ్రూ జూలాజికల్ పార్క్ క్యూరేటర్‌గా ప్రభుత్వం నియమించింది.

నిమిషం ఆలస్యమైనా నో ఎంట్రీ

- రేపటి నుంచి ఇంటర్ పరీక్షలు
- ఉదయం 8: 45 గంటల కల్లా పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలి
- హాజరుకానున్న 9.80 లక్షల మంది విద్యార్థులు
- పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు
- సెల్‌ఫోన్లపై ఆంక్షల విధింపు
- లీకేజీలు, కాపీయింగ్ నేపథ్యంలో అదనపు భద్రత

హైదరాబాద్, ఫిబ్రవరి 26 (నమస్తే తెలంగాణ) : ఇంటర్ వార్షిక పరీక్షలకు నిమిషం ఆలస్యమైనా అనుమతించబోమని అధికారులు తెలిపారు. ఈ నెల 28 నుంచి మార్చి 19 వరకు పరీక్షలు జరుగుతాయని పేర్కొన్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరిగే ఈ పరీక్షలకు ఈసారి 9,80,978 మంది విద్యార్థులు హాజరుకానున్నారని వివరించారు. వీరిలో 4,78,718 మంది విద్యార్థులు మొదటి సంవత్సరం వారుండగా, 5,02,260 మంది విద్యార్థులు ద్వితీయ సంవత్సరంవారు ఉన్నారని తెలిపారు. సెకండియర్ పరీక్షలకు హాజరయ్యే వారిలో 58,071 మంది ప్రైవేట్ విద్యార్థులు న్నట్టు వెల్లడించారు. కాగా, రాష్ట్రవ్యాప్తంగా ఇంటర్ పరీక్షల నిర్వహణకు 1,521 సెంటర్లను అధికారులు ఏర్పాటుచేసినట్టు చెప్పారు. వీటిలో 880 సెంటర్లను ప్రైవేట్ కాలేజీలుండగా, 407 ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో, మరో 234 సెంటర్లను గురుకులాల్లో ఏర్పాటు చేసినట్టు వివరించారు. ఇక పరీక్షల కోసం 27,900 మంది ఇన్విజిలేటర్లు విధులు నిర్వర్తించనున్నారని పేర్కొన్నారు. అన్ని జిల్లాల్లోనూ అవసరాలకు తగ్గట్టుగా ప్రభుత్వ పాఠశాలల టీచర్లు, సిబ్బందిని పరీక్షల విధుల్లోకి తీసుకొంటున్నట్టు వివరించారు.కలెక్టర్లు, పోలీసు అధికారులు పరీక్షాకేంద్రాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తారు. సెల్‌ఫోన్లపై కఠిన ఆంక్షలు విధించారు. మాల్ ప్రాక్టీస్, కాపీయింగ్‌ను ప్రోత్సహించిన యాజమాన్యాలపై సెక్షన్ -25 ప్రకారం కఠిన చర్యలు తీసుకొంటారు. ప్రతీ పరీక్ష కేంద్రాల వద్ద 144వ సెక్షన్ అమలులో ఉంటుంది. విద్యార్థులు తమ హాల్‌టికెట్లను tsbie.cgg.gov.in వెబ్ సైట్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

సిబ్బంది ఏర్పాట్లు

పరీక్షాకేంద్రాలు	1,521
చీఫ్ సూపరింటెండెంట్లు	1,521
ఇన్విజిలేటర్లు	27,900
ఫ్లయింగ్ స్క్వాడ్	75
సిట్టింగ్ స్క్వాడ్	200

ప్రశాంతంగా పరీక్షలు రాయండి : ఇంటర్ బోర్డ్ కార్యదర్శి శృతి ఓజా

విద్యార్థులు ఎలాంటి మానసిక ఒత్తిడికి లోనుకాకుండా పరీక్షలు రాయాలని ఇంటర్ బోర్డ్ కార్యదర్శి శృతి ఓజా సూచించారు. పరీక్షల నేపథ్యంలో ఆమె సోమవారం హైదరాబాద్ నాంపల్లిలోని ఇంటర్‌బోర్డు కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. పరీక్షలను సజావుగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని చెప్పారు. అన్నిశాఖలతో సమన్వయం చేసుకుని.. గతానికి భిన్నంగా పరీక్షలు నిర్వహించాలని తాము సంకల్పించినట్టు పేర్కొన్నారు. పరీక్షా కేంద్రాల్లో తాగునీరు, డ్యూయల్‌డెస్క్ బెంచీలు వంటి వసతులు కల్పించామని తెలిపారు. సమావేశంలో పరీక్షల నియంత్రణాధికారి (కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్) జయప్రదా భాయి, పరీక్షల విభాగం సంయుక్త కార్యదర్శి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పరీక్షలు రాసే విద్యార్థుల వివరాలు (కోర్సుల వారీగా)

సంవత్సరం	జనరల్	వొకేషనల్	మొత్తం
ఫస్టియర్	4,30,405	48,312	4,78,718
సెకండియర్	4,55,655	46,605	5,02,260

టెలిమానస్‌తో పరీక్షల టెన్షన్ పరార్

- నెల నెలా పెరుగుతున్న ఇంటర్ విద్యార్థుల కాల్స్
- పేరెంట్స్‌కూ కౌన్సెలింగ్‌తో చక్కటి ఫలితాలు



విద్యార్థి: మేడమ్ నేను ఇంటర్ ఫెయిలయ్యా. మళ్లీ పరీక్ష రాయాలంటే భయమేస్తున్నది. భయంతో చదవలేకపోతున్నా. చదవాలన్న ఆసక్తి ఉండటం లేదు. నాలుగు రోజుల్లో ఎగ్జామ్స్ ఉన్నాయి. మళ్లీ పాసవుతానో..! లేదోనని టెన్షన్‌గా ఉన్నది. నేనింతేనా.. నా పరిస్థితి ఏమిటి..? నన్నేం చేయమంటారో చెప్పండి ప్లీజ్.

కౌన్సెలర్: చదువుతున్నప్పుడు గంట గంటకు కొంతసేపు విరామం తీసుకోండి. సిలబస్ ఎంత పూర్తిచేశారో, ఇంకా ఎంత ఉన్నదో సమీక్షించుకోండి. రోజూ కనీసం ఎనిమిది గంటలు నిద్రపోండి. మొబైల్‌ఫోన్‌కు వీలైనంత దూరంగా ఉండండి. రిజల్ట్స్ ఎలా ఉంటాయోనన్న టెన్షన్‌ను వీడి ముందు పరీక్షలు బాగా రాయడంపై దృష్టిపెట్టండి. ఫలితం దానంతటదే వస్తుంది. ఫెయిలైతే జీవితం ముగిసినట్టు కాదు. మళ్లీ ప్రయత్నించండి. బీ బ్రేవ్.

మూడు రోజుల తర్వాత అదే విద్యార్థి: మేడం మీ కౌన్సెలింగ్ నాకు ఉపయోగపడింది. మీరిచ్చిన సలహాలతో టెన్షన్ పోయింది. పాసవుతానన్న నమ్మకం ఏర్పడింది. థ్యాంక్యూ సో మచ్.

ఇంటర్ వార్షిక పరీక్షల నేపథ్యంలో టెలిమానస్ కౌన్సెలర్, విద్యార్థి మధ్య జరిగిన సంభాషణ. సారాంశమిది.

ఇంటర్ వార్షిక పరీక్షలకు సన్నద్ధమవుతున్న విద్యార్థుల టెన్షన్‌ను టెలిమానస్ పోగొడుతున్నది. విపరీతమైన ఒత్తిడి, టెన్షన్, ఆత్మహత్య ఆలోచనలు ఉన్న విద్యార్థులకు సాంత్వన చేకూరుస్తున్నది. పరీక్షల నేపథ్యంలో మానసిక ఒత్తిడిని దూరం చేసేందుకు టెలిమెంటల్ హెల్త్ అసిస్టెన్స్ అండ్ నెట్‌వర్కింగ్ (టెలిమానస్) సేవలను వినియోగించుకునే వెసులుబాటు కల్పించారు. ఫిబ్రవరిలోనే అత్యధికంగా 236 మంది టెలిమానస్‌ను ఆశ్రయించారు. గత 4 నెలల్లో 475 మంది ఆశ్రయించగా, వీటిలో 230 పరీక్షల ఒత్తిడికి చెందినవే ఉన్నాయి. ఉదయం, లేదా సాయంత్రం సమయాల్లోనే విద్యార్థుల నుంచి తమకు కాల్స్ అధికంగా వస్తున్నట్టు టెలిమానస్ వర్గాలు తెలిపాయి.

ఆత్మహత్య చేసుకోవాలనిపిస్తున్నది

ఇటీవల ఒక విద్యార్థి టెలిమానస్‌కు ఫోన్ చేసి.. 'మేడం పరీక్షల టెన్షన్‌ను భరించలేకపోతున్నా.. నాకు ఆత్మహత్య చేసుకోవాలనిపిస్తున్నది' అంటూ బాధను వ్యక్తం చేశాడు. ఆ విద్యార్థి వ్యక్తిగత వివరాలను ఆరా తీసిన కౌన్సెలర్.. అతడితోపాటు, తల్లిదండ్రులకు కూడా కౌన్సెలింగ్ ఇచ్చారు.

– హైదరాబాద్ (నమస్తే తెలంగాణ)

అమెరికాలో కంటోన్మెంట్ యువకుడు మృతి

రుత్విక్ రాజన్ (మృతుడు)

బొల్లారం, ఫిబ్రవరి 26: ఉన్నత చదువుల కోసం విదేశాలకు వెళ్లిన ఓ యువకుడు బ్రెయిన్ స్ట్రోక్‌తో మృతి చెందాడు. ఈ సంఘటన తిరుమలగిరి పోలీస్ స్టేషన్ పరిధిలోని కంటోన్మెంట్ తిరుమలగిరి కాంట బస్తీలో కలకలం రేపింది. బస్తీకి చెందిన రిటైర్డ్ ఆర్టీవో తులసీ రాజన్ పెద్ద కుమారుడు బండా రుత్విక్ రాజన్ (30) రెండేండ్ల క్రితం అమెరికా వెళ్లాడు. అక్కడి టెక్సాస్ విశ్వవిద్యాలయంలో ఇటీవల ఎంఎస్ పూర్తి చేశారు. కొన్ని రోజుల క్రితం స్నేహితులతో కలిసి భోజనం చేస్తుండగా హఠాత్తుగా కిందపడిపోయాడు. దవాఖానకు తరలించగా, బ్రెయిన్ స్ట్రోక్‌తో మరణించినట్టు వైద్యులు నిర్ధారించారు. ఆదివారం రాత్రి మృతదేహాన్ని శంషాబాద్ విమానాశ్రయం నుంచి తిరుమలగిరిలోని వారి నివాసానికి తీసుకొచ్చారు. సోమవారం స్థానిక శ్మశానవాటికలో అంత్యక్రియలు పూర్తి చేశారు.

ధర్నా చేస్తున్న నిర్వాసితులతో మాట్లాడుతున్న జెన్‌కో సీఈ సిద్ధయ్య

బొగ్గు తవ్వకాలను అడ్డుకున్న భూనిర్వాసితులు

మల్హర్, ఫిబ్రవరి 26: తాడిచర్ల జెన్‌కో ఆధ్వర్యంలో ఏఎమ్మార్ కంపెనీ చేపడుతున్న బొగ్గు తవ్వకాలను తాడిచర్ల భూ నిర్వాసితులు సోమవారం అడ్డుకున్నారు. కొన్నేండ్లుగా డేంజర్ జోన్ లోపల ఉన్న గృహాలను తీసుకుంటామని సర్వే చేసి ఇప్పటికీ తీసుకోకపోవడంతో నిత్యం బ్లాస్టింగ్‌లతో ఇండ్లలోకి దుమ్ముధూళి చేరుతున్నదని తెలిపారు. ఆ ఇండ్లల్లో నివాసం ఉంటున్న తమకు శ్వాస ఆడక ఇబ్బంది పడుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమ సమస్య తీర్చేవరకు బొగ్గు తవ్వకాలు నిలిపివేయాలంటూ మైన్‌లో పనులను అడ్డుకున్నారు. ఏఎమ్మార్ కంపెనీ అధికారులు, కాటారం డీఎస్పీ వచ్చి నచ్చజెప్పినా వినలేదు. జెన్‌కో సీఈ సిద్ధయ్య హామీ ఇవ్వాలని పట్టుబట్టడంతో ఆయన అక్కడికి చేరుకొని నిర్వాసితులతో మాట్లాడారు. కొత్త ప్రభుత్వం ఏర్పడి రెండు నెలలే అయిందని నాలుగు నెలల సమయం ఇవ్వాలని కోరారు. బోర్డు అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరిస్తామని చెప్పడంతో ధర్నా విరమించారు.

నేటి నుంచి టీజీటీ అభ్యర్థుల సర్టిఫికెట్ వెరిఫికేషన్

హైదరాబాద్, ఫిబ్రవరి26 (నమస్తే తెలంగాణ) : ట్రైన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్ (టీజీటీ) పోస్టుల భర్తీకి అభ్యర్థుల సర్టిఫికెట్ వెరిఫికేషన్ మంగళవారం నుంచి నిర్వహించనున్నట్టు ట్రిబ్ తెలిపింది. ఇప్పటికే ఇందుకు సంబంధించి సబ్జెక్టులవారీగా షెడ్యూల్‌ను ప్రకటించింది. ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, బీసీ, జనరల్ గురుకులాల్లో టీజీటీ పోస్టులు 4,020 ఉండగా, వీటి భర్తీకి ట్రిబ్ ఇప్పటికే పరీక్ష నిర్వహించింది. తాజాగా 1:2నిష్పత్తిలో మెరిట్ జాబితాను విడుదల చేసింది.

జూన్ 9న గ్రూప్ -1 ప్రిలిమ్స్

- పరీక్షతేదీని ఖరారుచేసిన టీఎస్‌పీఎస్సీ
- ఓఎమ్మార్ పద్ధతిలోనే నిర్వహించే అవకాశం

హైదరాబాద్, ఫిబ్రవరి 26 (నమస్తే తెలంగాణ) : గ్రూప్ -1 ప్రిలిమ్స్ పరీక్ష తేదీని టీఎస్‌పీఎస్సీ ఖరారుచేసింది. జూన్ 9న ప్రిలిమ్స్ నిర్వహించనున్నట్టు వెల్లడించింది. ఈ మేరకు టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి నవీన్ నికోలస్ సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పాత నోటిఫికేషన్‌ను రద్దుచేసిన రాష్ట్ర ప్రభుత్వం.. 563 పోస్టులతో ఈ నెల 19న కొత్తగా గ్రూప్ -1 నోటిఫికేషన్ జారీచేసిన సంగతి తెలిసిందే. ప్రస్తుతానికి దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ఆన్‌లైన్‌లో కొనసాగుతున్నది. అభ్యర్థులు మార్చి 14 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రిలిమ్స్‌ను మే లేదా జూన్ మాసాల్లో నిర్వహిస్తామని టీఎస్‌పీఎస్సీ నోటిఫికేషన్‌లో వెల్లడించింది. అయితే సోమవారం ఇతర పరీక్షలు సహా పలు అంశాలపై చర్చించి ప్రిలిమ్స్ పరీక్ష తేదీని ఖరారుచేసింది. తాజా సమాచారం ప్రకారం జూన్ 9న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్ష నిర్వహించనున్నారు. ప్రశ్నపత్రంలో మొత్తం 150 ప్రశ్నలుంటాయని తెలిపారు.

ఓఎమ్మార్ పద్ధతిలోనే..!

తాజా అంచనాల ప్రకారం గ్రూప్-1 ప్రిలిమ్స్‌ను ఓఎమ్మార్ పద్ధతిలోనే నిర్వహించే అవకాశముంది. గత వారం విడుదల చేసిన నోటిఫికేషన్‌లో ప్రిలిమ్స్ పరీక్షను ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్‌లో నిర్వహిస్తామని టీఎస్‌పీఎస్సీ స్పష్టంచేసింది. ఆఫ్‌లైన్‌లో ఓఎమ్మార్ పద్ధతిలో నిర్వహిస్తే 33 జిల్లాల్లో, ఆన్‌లైన్‌లో నిర్వహిస్తే పాత ఉమ్మడి పది జిల్లాల్లో పరీక్షా కేంద్రాలను కేటాయిస్తామని వెల్లడించింది. తాజాగా స్వీకరిస్తున్న దరఖాస్తుల్లోను అభ్యర్థులు ఆఫ్‌లైన్‌కు, ఆన్‌లైన్‌కు వేర్వేరుగా పరీక్షలు నిర్వహించే జిల్లాలను ఎంచుకునే అవకాశమిచ్చింది. గతంలో గ్రూప్ -1 ప్రిలిమ్స్‌కు 3.8 లక్షల దరఖాస్తులొచ్చాయి. ఈ సారి ఆ సంఖ్య మరింత పెరుగుతుందన్న అంచనాలున్నాయి. ఒకేరోజు ఇంతమందికి ఆన్‌లైన్‌లో పరీక్ష నిర్వహించడం సాధ్యంకాదని, రెండు మూడు రోజులు పడుతుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఒకే రోజు పరీక్ష నిర్వహిస్తామని టీఎస్‌పీఎస్సీ పేర్కొంటున్న నేపథ్యంలో అది ఓఎమ్మార్ పద్ధతిలోనే ఉంటుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. దీనిపై టీఎస్‌పీఎస్సీ ఇంకా స్పష్టతనివ్వలేదు.

విద్యా - ఉద్యోగ సమాచారం

గోపాల్ టీకే కృష్ణ దంపతులకు జ్ఞాపికను అందజేస్తున్న ఓయూ అధికారులు

ఓయూ ఇంజినీరింగ్ విభాగానికి 5 కోట్ల విరాళం

ఉస్మానియా యూనివర్సిటీ, ఫిబ్రవరి 26: ఓయూ ఇంజినీరింగ్ కళాశాలలోని ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విభాగానికి పూర్వ విద్యార్థి భారీ విరాళం ప్రకటించారు. ప్రతిపాదిత క్లాస్ రూం కాంప్లెక్స్ 'వై నరసింహన్ బిల్డింగ్' నిర్మాణానికి రూ.5 కోట్లు విరాళంగా ఇచ్చి గోపాల్ టీకే కృష్ణ తన ఉదారతను చాటుకొన్నారు. 106 ఏండ్ల ఓయూ చరిత్రలో వ్యక్తిగతంగా అత్యధిక విరాళం అందజేసిన ఘనతను ఆయన సొంతం చేసుకొన్నారు. ఈ సందర్భంగా గోపాల్ టీకే కృష్ణ దంపతులను ఇంజినీరింగ్ కళాశాల అధికారులు, పూర్వ విద్యార్థుల సంఘం ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విభాగంలో 1968లో ఆయన బీఈ పూర్తి చేశారు. స్వలాభాపేక్ష లేకుండా తన విరాళంతో నిర్మిస్తున్న భవనాలకు తనకు విద్యను నేర్పిన అధ్యాపకుల పేర్లు పెట్టడం విశేషం. ప్రొఫెసర్ వీఎం గాడ్గిల్ ఆడిటోరియం, ప్రొఫెసర్ ఆబిద్ అలీ కమిటీ రూం లతో పాటు ల్యాబ్‌లకు అక్కడి ల్యాబ్ సిబ్బంది పేర్లు పెట్టాలని వర్సిటీకి ప్రతిపాదించారు.

ఏటా రెండుసార్లు టెట్

జూన్, డిసెంబర్‌లో పరీక్షల నిర్వహణ

హైదరాబాద్, ఫిబ్రవరి 26 (నమస్తే తెలంగాణ) : ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)ను ఇక నుంచి ఏటా రెండు సార్లు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. జూన్, డిసెంబర్ మాసాల్లో తప్పనిసరిగా టెట్ జరిగేలా నిర్ణయం తీసుకొన్నది. ఇందుకు సీఎం రేవంత్ రెడ్డి ఇటీవలే ఆమోదం తెలిపారు. అయితే, డీఎస్సీ నోటిఫికేషన్లతో సంబంధం లేకుండా ఏటా రెండుసార్లు టెట్ నిర్వహిస్తారు. ప్రస్తుతం టెట్ నిర్వహణకు 90 రోజుల సమయం పట్టనుండగా, అంతకుముందే నోటిఫికేషన్‌ను విడుదల చేస్తున్నారు. నేషనల్ కౌన్సిల్ ఫర్ టీచర్ ఎడ్యుకేషన్ (ఎన్సీటీఈ) గతంలోనే ఏటా రెండుసార్లు ఏటా నిర్వహించాలని ఆదేశించింది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకొన్నది. అంతే కాకుండా టెట్ గడువును 7 ఏండ్ల నుంచి జీవితకాలానికి పొడిగించింది. గతంలో టెట్‌లో అర్హతసాధించిన వారు .. స్కోర్ పెంచుకోవాలనుకొనే వారు..కొత్తగా బీఈడీ, డీఐఈడీ వంటి కోర్సులను పూర్తిచేసిన వారు మాత్రమే టెట్ రాసేవారు. ఇప్పుడు స్కూల్ అసిస్టెంట్ పదోన్నతులకు పేపర్ -2లో క్వాలిఫై కావాలన్న నిబంధన ఉన్నది. దీంతో టీచర్లు కూడా టెట్‌కు పోటీ పడనున్నారు. దీంతో టెట్‌కు హాజరయ్యే వారి సంఖ్య పెరిగే అవకాశాలున్నాయి. పదోన్నతులు పొందే వారికి ఎక్కువసార్లు టెట్ రాసుకొనే వెసులుబాటు కలగనున్నది.

ఎప్‌సెట్‌కు తొలిరోజు 3,113 దరఖాస్తులు

హైదరాబాద్, ఫిబ్రవరి 26 (నమస్తే తెలంగాణ) : ఇంజినీరింగ్, ఫార్మసీ, బీఎస్సీ అగ్రికల్చర్ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే టీఎస్ ఈఏపీ సెట్ (ఎప్‌సెట్) దరఖాస్తుల స్వీకరణ సోమవారం నుంచి ప్రారంభమయ్యింది. సోమవారం ఉదయం 10 గంటల నుంచి దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించగా, తొలిరోజు 3,113 దరఖాస్తులు వచ్చాయి. ఇంజినీరింగ్ విభాగానికి 1,983 అర్జీలు రాగా, అగ్రికల్చర్, ఫార్మసీ విభాగానికి 1,130 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నట్టు ఎప్‌సెట్ కన్వీనర్ ప్రొఫెసర్ డీన్‌కుమార్ తెలిపారు. ఆలస్య రుసుము లేకుండా ఏప్రిల్ 6 వరకు, ఆలస్య రుసుముతో మే 4 వరకు దరఖాస్తు చేసుకునే అవకాశముంది.

మీడియా వ్యాపిస్తున్నా వార్తాపత్రికలదే హవా

డాక్టర్ శశాంక్ గోయెల్

హైదరాబాద్, ఫిబ్రవరి 26 (నమస్తే తెలంగాణ) : మీడియాలో అనేక మార్పులొస్తున్నా, మీడియా వ్యాపిస్తున్నా.. వార్తా పత్రికలదే హవా కొనసాగుతున్నదని డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ (ఎంసీఆర్‌హెచ్చార్డీ) డైరెక్టర్ జనరల్ డాక్టర్ శశాంక్ గోయెల్ అభిప్రాయపడ్డారు. జర్నలిజం, కమ్యూనికేషన్ రంగంలో ఎప్పటికప్పుడు మార్పులు వస్తున్నాయని తెలిపారు. దక్షిణాఫ్రికా మీడియా నిపుణుల శిక్షణ కార్యక్రమాన్ని జూబ్లీహిల్స్‌లోని ఎంసీఆర్‌హెచ్చార్డీలో సోమవారం ప్రారంభమయ్యింది. భారత విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ, ఇండియన్ టెక్నికల్ అండ్ ఎకనామిక్ కో-ఆపరేషన్ సంయుక్తంగా ఏర్పాటు చేసిన ఈ శిక్షణ శిబిరాన్ని శశాంక్ గోయెల్ ప్రారంభించి మాట్లాడారు. ఈ శిక్షణలో మొత్తం 29 మంది దక్షిణాఫ్రికా మీడియా నిపుణులు పాల్గొంటున్నారు. మీడియా, కమ్యూనికేషన్ రంగంలో లోతైన పరివర్తన దశలో ఉన్నామని, ఇది మార్పు మాత్రమే కాదని.. ఇదొక విప్లవం అని ఆయన అభివర్ణించారు. ఫేస్‌బుక్, ఎక్స్, ఇన్‌స్టాగ్రామ్ వంటి వేదికలు సమాచారాన్ని అందించే మూలాలుగా తయారయ్యాయని, మొత్తంగా సోషల్ మీడియా సూపర్ పవర్‌గా మారిందని చెప్పారు. కోర్సు డైరెక్టర్ మాధవి రావులపాటి, ప్రొఫెసర్ మహ్మద్ అబ్బాస్ అలీ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

నేటి నుంచి మైనార్టీ గురుకుల విద్యార్థుల ఆర్ట్ ఎగ్జిబిషన్

హైదరాబాద్, ఫిబ్రవరి26 (నమస్తే తెలంగాణ): మైనారిటీ గురుకులాల విద్యార్థుల ఆర్ట్ ఎగ్జిబిషన్‌ను మంగళవారం నుంచి 29 వరకు నిర్వహించనున్నట్టు గురుకులాల సొసైటీ సెక్రటరీ ఆయేషా మస్రత్ ఖానం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్ మాదపూర్‌లోని కావూరిహిల్స్‌లోని స్టేట్ ఆర్ట్ గ్యాలరీలోని ఎంపీసీసీ హాల్‌లో ఆర్ట్ ఎగ్జిబిషన్ కొనసాగనున్నదని వెల్లడించారు. బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆర్ట్ ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తారని పేర్కొన్నారు.

భూగర్భ జలశాఖ రాత పరీక్ష ఫలితాల వెల్లడి

హైదరాబాద్, ఫిబ్రవరి 26 (నమస్తే తెలంగాణ) : భూగర్భ జలశాఖలో గెజిటెడ్, నాన్ గెజిటెడ్ ఉద్యోగాల భర్తీకి నిర్వహించిన రాత పరీక్ష ఫలితాలను టీఎస్‌పీఎస్సీ సోమవారం విడుదల చేసింది. పోస్టుల వారీగా మెరిట్ ఆధారంగా జనరల్ ర్యాంకింగ్ లిస్టు (జీఆర్ఎల్)ను టీఎస్‌పీఎస్సీ తన వెబ్‌సైట్‌లో పొందుపరిచింది. సర్టిఫికెట్ వెరిఫికేషన్ షెడ్యూల్‌ను త్వరలోనే ప్రకటిస్తామని టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి నవీన్ నికోలస్ తెలిపారు. నిరుడు జూలై 18, 19, 20, 31 తేదీల్లో ఈ పరీక్షలను నిర్వహించిన విషయం తెలిసిందే.

కనీస వేతనాల జీవోను సవరించాలి : బీఎంఎస్

హైదరాబాద్, ఫిబ్రవరి 26 (నమస్తే తెలంగాణ) : కనీస వేతనాల జీవోను తక్షణమే సవరించాలని భారతీయ మజ్దూర్ సంఘ్ (బీఎంఎస్) రాష్ట్ర అధ్యక్షుడు కలాల్ శ్రీనివాస్, ప్రధానకార్యదర్శి టీ రామిరెడ్డిలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో అసంఘటిత రంగ కార్మికులకు సంక్షేమబోర్డులు ఏర్పాటుచేయాలని, ఈఎస్ఐ, పీఎఫ్ వర్తింపజేయాలని కోరారు. ఈ మేరకు మంగళవారం అన్ని జిల్లాల కలెక్టర్లకు వినతిపత్రాలు అందజేస్తామని పేర్కొన్నారు. ఆ తర్వాత దశల వారీగా ఆందోళనలు చేపడుతామని తెలిపారు.

లక్ష్యం.. లక్ష ఎకరాలు

వచ్చే ఏడాది ఆయిల్‌పామ్ సాగు లక్ష్యం ఖరారు

- లక్ష ఎకరాల్లో సాగుకు నిర్ణయం
- అత్యధికంగా ఖమ్మంలో 13 వేల ఎకరాలు
- ఈ ఏడాది నత్తనడకన సాగు
- ఇప్పటి వరకు 56 వేల ఎకరాలే..
- వచ్చేసారీ కష్టమేనని అనుమానం

హైదరాబాద్, ఫిబ్రవరి 26(నమస్తే తెలంగాణ): వచ్చే 2024-25 సంవత్సరంలో లక్ష ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు చేయాలని ఉద్యానశాఖ నిర్ణయించింది. ఈ మేరకు రాష్ట్ర వ్యాప్తంగా సాగు ప్రణాళికను రూపొందించింది. దీనిలో అత్యధికంగా ఖమ్మం జిల్లాలో 13 వేల ఎకరాల్లో, అత్యల్పంగా కుమ్రం భీం-ఆసిఫాబాద్ జిల్లాలో 400 ఎకరాల్లో సాగుకు లక్ష్యాన్ని నిర్దేశించింది. కేసీఆర్ ప్రభుత్వం మాదిరిగానే వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కూడా ఆయిల్‌పామ్ సాగు పెంపుపై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారు. కేసీఆర్ ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమాన్ని మరింత ముందుకు తీసుకెళ్లేందుకు ఆయన చొరవ చూపుతున్నారు. తద్వారా రైతులు లాభదాయకమైన పంటల వైపు మళ్లి లాభాలు ఆర్జించే అవకాశం ఉంటుంది. అయితే రాష్ట్రవ్యాప్తంగా ఈ ఏడాది ఆయిల్‌పామ్ అంతంత మాత్రంగానే సాగవుతున్నది. 2 లక్షల ఎకరాల్లో సాగు లక్ష్యాన్ని నిర్ణయించగా, ఇప్పటివరకు కేవలం 56 వేల ఎకరాల్లో మాత్రమే సాగైనట్టు అధికారులు తెలిపారు. సాగుపై ఎన్నికల ప్రభావం పడినట్టు వారు తెలిపారు. ఎన్నికల సమయంలో అధికారులంతా ఎన్నికల విధుల్లో ఉండటంతో రైతులను ఆయిల్‌పామ్ సాగు వైపు మళ్లించడంలో జాప్యం జరిగింది. ఈ ఏడాది ధాన్యానికి మంచి ధర పలకడంతో ఆయిల్‌పామ్ సాగుకు సిద్ధమైన రైతులు ఆ తర్వాత వెనక్కి తగ్గారు. ఈ ఏడాది మరో రెండు నెలల గడువు ఉండటంతో మరో నాలుగైదు వేల ఎకరాల్లో సాగువిస్తీర్ణం పెరిగినా 60 వేల ఎకరాల వరకు సాగయ్యే అవకాశం ఉన్నదని అధికారులు అంచనా వేస్తున్నారు. నిరుడు రికార్డు స్థాయిలో 85 వేల ఎకరాల్లో సాగు కావడం విశేషం.

అధిక సాగు విస్తీర్ణం గల జిల్లాల వివరాలు

జిల్లా	సాగు లక్ష్యం
ఖమ్మం	13,000
కొత్తగూడెం	11,000
నల్లగొండ	6,700
మహబూబాబాద్	5,000
సిద్దిపేట	4,800
సూర్యాపేట	4,800
నిర్మల్	4,200
జగిత్యాల	3,850
వరంగల్	3,800
యాదాద్రి	3,500
జనగాం	3,400
నాగర్‌కర్నూల్	3,000

సాగుపై వర్షాభావ ప్రభావం

వచ్చే ఏడాది (2024-25) కూడా ఆయిల్‌పామ్ సాగు అంతంత మాత్రంగానే ఉంటుందని అధికారులు అభిప్రాయ పడుతున్నారు. ముఖ్యంగా వర్షాలు తగ్గితే ఆ ప్రభావం ఆయిల్‌పామ్ సాగుపై ఎక్కువగా ఉంటుంది. ఈ ఏడాదంతా ఎన్నికలు కూడా ప్రభావం చూపుతుందని అంటున్నారు.

ఎలుకలకు చెల్లు 'చిట్టీ'!

- *నివారణకు అద్భుత చిట్కా*
- *కనిపెట్టిన రైతు రాజిరెడ్డి*
- *ఎగబడుతున్న రైతులు*

హైదరాబాద్, ఫిబ్రవరి 26 (నమస్తే తెలంగాణ) : ఎలుకల బారి నుంచి పంటలను కాపాడుకోవటానికి రైతులు కన్నమ్మ కష్టాలు పడుతుంటారు. ఉచ్చులు పెట్టడం, పొలం గట్లపై ఉన్న బొరియల నుంచి వాటిని తరిమేయటానికి పొగ పెట్టటం, పురుగుమందులను ఉంచటం లాంటివి ఎన్ని చేసినా ఎలుకల సమస్య రైతులను పట్టి పీడిస్తూనే ఉంటుంది. దీనికి విరుగుడుగా ఇప్పుడు ఓ కొత్త పద్ధతిని రైతులు అవలంబిస్తున్నారు. మూడు మీటర్ల ఎత్తులో ఉండే ఓ కర్రకు చిట్టీ కట్టి పొలంలో నాటితే చాలు.. ఇక ఎలుకల బెడద ఉండనే ఉండదట. సిద్దిపేట జిల్లాలోని వందలాది రైతులు ఇప్పుడు ఈ ఎలుకల చిట్టీ కోసం దీని రూపకర్త, రైతు అయిన రాజిరెడ్డికి పరుగులు తీస్తున్నారు. ఇది మూఢనమ్మకమే అయినా.. ఎలుకల బెడద నుంచి పంటలను కాపాడుకోవటానికి రైతులు పడుతున్న తాపత్రయానికి ఉదహారణగా నిలుస్తున్నది. భూంపల్లిలోని నాగారం గ్రామానికి చెందిన రాజిరెడ్డి ఇంటి దగ్గర వరి రైతులు బారులు తీరుతున్నారు. ఎలుకల చిట్టీల కోసం ఎంత డిమాండ్ ఏర్పడిందంటే ఏకంగా నాలుగు గంటల పాటు క్యూలో నిలబడాల్సి వస్తున్నది. రైతులు తమ పేరు, భూమి విస్తీర్ణం, గ్రామం పేరు తదితర వివరాలిస్తే.. ప్రత్యేకంగా ఓ మంత్రాన్ని సర్వే నెంబర్‌తో సహా రాసి రాజిరెడ్డి ఇస్తాడు. చిట్టీ అందుకున్నాక ఎక్కడా ఆగకుండా నేరుగా పొలానికి వెళ్లి చిట్టీకట్టిన కర్రను నాటాలి. ప్రతి సీజన్‌లో ఎలుకల వల్ల 80 నుంచి 90 శాతం పంటకు నష్టం వాటిల్లేదని, ఈ చిట్టీని కట్టడం వల్ల ఆ బాధ తప్పిందని నారాయణరావు పేటకు చెందిన రైతు మహంకాళి భిక్షపతి తెలిపారు. తాను గత ఐదేండ్లుగా ఈ చిట్టీని పొలంలో కడుతున్నానని చెప్పారు. ఈ విషయం బాగా ప్రాచుర్యం పొందటంతో సిద్దిపేటతోపాటు పొరుగున ఉన్న రాజన్న సిరిసిల్ల, ఇతర జిల్లాల రైతులు కూడా రాజిరెడ్డిని కలవటానికి వస్తున్నారట. నిత్యం వంద మందికి పైగా ఈ చిట్టీలను తీసుకొని వెళుతున్నారని చెప్తున్న రాజిరెడ్డి ఒక్కో చిట్టీకి 50 నుంచి వంద రూపాయల దాకా వసూలు చేస్తున్నానని తెలిపారు. అయితే ఆ చిట్టీలో రాసిన అక్షరాలను ఎవరూ చదవలేకపోతున్నారు. ప్రాచీన తెలుగు భాషకు సంబంధించినటు వంటి అక్షరాలేవో ఉన్నట్టు తెలిసింది.